సాక్షి
జనగామ

7

సోమవారం । 2 । సెప్టెంబర్ । 2024

దెబ్బతిన్న రైల్వే ట్రాక్..
● పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

తాడ్వాయిలో టోర్నడోలు..
● భారీ ఈదురుగాలులు వందల సంఖ్యలో నేలకూలిన చెట్లు
● పరిశీలించిన మంత్రి సీతక్క

మృత్యు ప్రవాహం
● వరద నీటిలో కొట్టుకుపోయి ముగ్గురు మృత్యువాత



రైల్వే రవాణా అతలాకుతలం..
● ప్రయాణికులకు ఇబ్బందులు

- వివరాలు 8లో

జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్



జాతీయ రహదారిపై నిలిచిన నీరు వెళ్లేందుకు పొక్లెయినర్‌తో డివైడర్‌ను తొలగిస్తున్న దృశ్యం

రఘునాథపల్లి: కుంభవృష్టితో రఘునాథపల్లి వద్ద వరంగల్‌–హైదరాబాద్ జాతీయ రహదారిపై వరద ముంచెత్తింది. మోకాలి లోతు నీరు నిలవడంతో వాహన రాకపోకలు స్తంభించాయి. మంత్రి సీతక్క కాన్వాయ్ కూడా వరదలో చిక్కుకుపోయింది. డీసీపీ రాజమహేంద్రనాయక్, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి రంగంలోకి దిగారు. పోలీసుల సహాయంతో మంత్రి వాహనాన్ని ట్రాఫిక్‌జామ్ నుంచి బయటకు పంపించారు. భారీగా వర్షపు నీరు నిలవడంతో డివైడర్‌ను పొక్లెయినర్‌తో తొలగించారు. అయినా వరద నీరు వెళ్లడానికి రెండు గంటల సమయం పట్టింది. పోలీసులు, అధికారులు తీవ్రంగా శ్రమించినా.. జాతీయ రహదారిపై మూడు గంటల పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

వాగులో కొట్టుకుపోయిన జీవాలు

● ఇద్దరు పెంపకందారులు కూడా..
● సహచరుడి సాయంతో తప్పిన ప్రాణాపాయం

దేవరుప్పుల : భారీ వర్షంతో కడవెండి వాగు ఉధృతి కారణంగా వరదలో మూగజీవాలతోపాటు ఇద్దరు పెంపకందారులు కొట్టుకుపోగా.. ఆ ఇద్దరు ప్రాణపాయం నుంచి బయటపడ్డారు. కడవెండికి చెందిన గొర్రెల, మేకల పెంపకందారులు మహ్మద్ అంకూస్, ఉప్పుల చంద్రయ్య సుమారు 150 జీవాలను మేత కోసం మాలవాగు ఏరియా నుంచి సీతారాంపురం ఒడ్డుకు చేర్చారు. వాగులో వరద పెరగడాన్ని పసిగట్టి జీవాలను స్వగ్రామానికి తీసుకెళ్లడానికి వెనుదిరిగారు. అయితే జీవాలు వాగు మధ్య ఉన్న ఒడ్డున పచ్చగడ్డి మేసే క్రమంలో చుట్టూ నీరు పెరిగి అవి ఎటూ పోలేని పరిస్థితి నెలకొంది. అవతల ఒడ్డుకు చేరి జీవాలను కాపాడటానికి పెంపకందారులిద్దరు వెళ్లే క్రమంలో చంద్రయ్య వరదకు కొట్టుకుపోతుండగా.. అంకూస్ అతడిని వెంబడించి ఓ చోట ఆపాడు. ఇంతలో పరిసరాల్లోని రైతు పెద్ది సోమయ్య, గ్రామస్తులు పసునూరి సంపత్ తదితరులు చేరుకొని వారిని ఒడ్డుకు చేర్చారు. ఈ క్రమంలోనే వాగు ఒడ్డు కోతకు గురికావడంతో జీవాలు నీటిలో కొట్టుకుపోయాయి. విషయం తెలిసిన తహసీల్దార్ హుస్సేన్, ప్రత్యేక అధికారి రాము, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. జీవాలు దేవరుప్పుల చెక్‌డ్యాం ఏరియాకు చేరాయనే సమాచారంతో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆమె పెంపకందారులను ఓదార్చారు. కలెక్టర్ రిజ్వాన్‌బాషాతో ఫోన్‌లో మాట్లాడి బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



కడవెండి-దేవరుప్పుల వాగు మధ్యలో కొట్టుకుపోతున్న జీవాలు



పెంపకందారులు అంకూస్, చంద్రయ్య

ప్రాణాలకు తెగించి.. వరదలోకి దిగి..

జనగామ: జిల్లాలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో పాలకుర్తి మండలం గూడూరు శివారు కిష్టాపూర్‌తండా పరిధిలో వరద పోటెత్తడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ప్రతికూల పరిస్థితుల్లో ఎన్పీడీసీఎల్ సిబ్బంది ఆదివారం వరదలో ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ఈదుకుంటూ కరెంటు స్తంభం వరకు చేరుకుని మరమ్మతు చేసి విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.



వరద నీటి మధ్యలో స్తంభం వద్ద విద్యుత్ పునరుద్ధరణ పనులు చేస్తున్న సిబ్బంది

జిల్లాలో రెండు రోజుల యావరేజ్ వర్షపాతం వివరాలు(మిల్లీమీటర్లలో)		
మండలం	31వ తేదీ	1వ తేదీ
కొడకండ్ల	293.5	32.5
పాలకుర్తి	177.5	109.5
జఫర్‌గఢ్	152.8	76.8
దేవరుప్పుల	140.8	27.0
నర్మెట	105.3	92.5
చిల్పూరు	104.0	48.0
తరిగొప్పుల	97.5	75.3
బచ్చన్నపేట	89.5	90.3
జనగామ	79.3	88.9
స్టేషన్‌ఘన్‌పూర్	78.3	76.3
లింగాలఘణపురం	63.3	52.0
రఘునాథపల్లి	4.0	-

నేటి గ్రీవెన్స్ రద్దు

● విద్యాసంస్థలకు సెలవు

జనగామ : భారీ వర్షాలతో చెరువులు, కుంటలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగొద్దనే ఉద్దేశంతో సోమవారం(నేడు) కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే జిల్లాలోని అన్ని విద్యా సంస్థలకు నేడు సెలవు ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం నాటి సెలవుకు బదులు ఈనెల 14న రెండో శనివారం విద్యాసంస్థలు పనిదినంగా గమనించాలని కోరారు.



నర్మెట : వెల్దండలో ఇంట్లోకి చేరిన వర్షపు నీటిని బయటకు తోడిపోస్తున్న బాలిక

ముంచెత్తిన వాన

పొంగిన వాగులు.. మత్తడి పోస్తున్న చెరువులు

● నీట మునిగిన వరి, పత్తి పంటలు
● కల్వర్టుల వద్ద నిలిచిన రాకపోకలు
● పలు ప్రాంతాల్లో తెగిన తాత్కాలిక రోడ్లు
● పలు మండలాల్లో కూలిన ఇళ్లు
● జనగామ పట్టణంలో వరద ఉధృతి
● తెగిన విద్యుత్ లైన్లు.. సంస్థకు భారీ నష్టం
● కలెక్టర్ నేతృత్వంలో అధికారుల పర్యటనలు
● అప్రమత్తంగా ఉండాలి : వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్, మంత్రులు



చీటకోడూరు వాగు ఉధృతికి జనగామ-పాలకుర్తి రహదారి కుందారం వద్ద కొట్టుకుపోయిన వంతెన తాత్కాలిక రోడ్డు

జనగామ: వానాకాలంలో ముఖం చాటేసిన వరుణుడు.. అల్పపీడన ప్రభావంతో జోరు వాన కురిపించి ప్రజలు, రైతులకు ఉపశమనం కలిగించాడు. ఆగస్టు 31 మధ్యాహ్నం నుంచి ఆదివారం సాయంత్రం వరకు దంచికొట్టిన వానతో వాగులు ఉప్పొంగి, చెరువులు మత్తడి పోస్తున్నాయి. శనివారం ఉదయం 8.30 నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు జిల్లాలో 100.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఆదివారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 57.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. కొడకండ్ల మండలంలో రికార్డు స్థాయి 29 సెంటీమీటర్ల వర్షం కురిసింది. భారీ వర్షంతో కల్వర్టుల వద్ద వరద పెరిగి అనేక చోట్ల రాకపోకలు స్తంభించాయి. మూడు ఇళ్లు నేలమట్టం కాగా, గానుగుపహాడ్ వద్ద హుస్నాబాద్ ప్రధాన రహదారిపై వేసిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆధ్వర్యాన డీసీపీ రాజమహేంద్రనాయక్, అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఇతర జిల్లా ఉన్నతాధికారులు పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. మహబూబాబాద్ జిల్లాలో రైల్వేట్రాక్ కొట్టుకు పోవడంతో రైళ్లు రద్దు కాగా.. ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు, లైన్లు తెగిపోవడంతో అధికారులు, సిబ్బంది పునరుద్ధరణ పనులు మొదలు పెట్టారు. కాగా సంస్థకు భారీ నష్టం వాటిల్లింది.

మండలాల వారీగా..

- జనగామ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు, పలు కాలనీలు వరద నీటితో నిండిపోయాయి.
- పాలకుర్తి మండలం వావిలాల నుంచి నల్లాని తండాకు వెళ్లే రోడ్డు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచి పోయాయి.
- చిల్పూరు మండలం నష్కల్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు నిలిచి ప్రజారవాణా బంద్ అయింది.
- జనగామ–నర్మెట–హుస్నాబాద్ ప్రధాన రహదారి గానుగుపహాడ్ జంక్షన్ వద్ద తాత్కాలిక కల్వర్టు రోడ్డు కొట్టుకుపోయింది. వాహనాలను దారి మళ్లించారు. ఆర్డీఓ కొమురయ్య పర్యవేక్షించారు.
- స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం, పాలకుర్తి మండలం తొర్రూరు గ్రామంలో వెంకన్న, తరిగొప్పుల మండలం పోతారానికి చెందిన నర్సమ్మకు సంబంధించి ఇళ్లు కూలిపోయాయి.
- నర్మెట మండలం హన్మంతాపూర్ కల్వర్టులపై వరద ఉధృతి పెరగడంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- జనగామ పట్టణం హైదరాబాద్ రోడ్డు పై వరద పెరగడంతో వ్యాపార, వాణిజ్య సంస్థల షట్టర్ల వరకు నీరు చేరింది. వాహనాలను వన్‌వే వైపు మళ్లించారు.
- జఫర్‌గఢ్ మండలం తమ్మడపల్లి(జి)లో వరి పొలం నీట మునిగి పోయింది.
- కొడకండ్ల మండలం బయ్యన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. రామవరం చెరువు మత్తడి పోసింది. మొండ్రాయి స్టేజీ వద్ద రోడ్డుపై చెట్లు కూలడంతో పోలీసు సిబ్బంది తొలగించారు.
- నర్మెట మండలం వెల్దండ గ్రామంలో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఊరచెరువు మత్తడి పోస్తోంది.

జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డులో పరిస్థితి తెలుసుకుంటున్న కలెక్టర్



అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● సమీక్షలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా
● కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం- 9052308621

జనగామ : భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా అన్నారు. ఆదివారం ఆయన జిల్లాలో పర్యటించిన అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. వాతావరణ శాఖ జిల్లాలో మరో రెండు రోజుల పాటు రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వరద ఉధృతి అధికంగా ఉన్న లోలెవల్ వంతెనలు, కాజ్‌వేల వద్ద రాకపోకలను నిలిపి వేయాలని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని చెప్పారు. చెరువులు, కుంటల్లో చేరుతున్న వరదను అధికార యంత్రాంగం నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో డ్రెయినేజీలు, మ్యాన్ హోల్స్ మూసుకుపోకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శిథిలమైన ఇళ్లలో నివాసముంటున్న వారిని ఖాళీ చేయించాలని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలకు దూరంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం నంబర్(90523 08621)కు కాల్ చేసి సమచారం ఇవ్వాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

రాత్రి సమయంలో అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల నేపథ్యంలో రాత్రి సమయంలో వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అవసరాన్ని బట్టి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. రాత్రి కలెక్టరేట్ నుంచి రెవెన్యూ, పోలీస్, పంచాయతీ, విద్యుత్ తదితర శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గడిచిన రెండు రోజులు ఎలాంటి నష్టం జరగకుండా బాధ్యతగా పని చేసిన ఉద్యోగులను అభినందించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో టాం టాం ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అధికారులకు మరో రెండు రోజులు సెలవులు లేవని స్పష్టం చేశారు.



జనగామ : బాణాపురం వెళ్లే రైల్వే దారిలో నిలిచిన వర్షపు నీరు



జఫర్‌గఢ్ మండలం తమ్మడపల్లి(జి) శివారులో తెగిన రోడ్డు



గానుగుపహాడ్ జంక్షన్ వద్ద తెగిన కొట్టుకుపోయిన రోడ్డు



రామవరం చెరువు మత్తడిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



తరిగొప్పులలో కూలిన ఇంటిలో దీనంగా చూస్తున్న యజమాని నర్సమ్మ

ప్రజలకు ఇబ్బంది కలగొద్దు: సీఎస్, మంత్రులు

జనగామ : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కలెక్టర్ పర్యవేక్షించాలని హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతికుమారి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం కలెక్టరేట్ నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వీసీ ద్వారా ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు అందుబాటులో ఉండి ప్రజలను అప్రమత్తం చేస్తూ.. రెవెన్యూ, పోలీస్‌శాఖ సేవలు క్షేత్రస్థాయిలో అందేలా చూడాలని పేర్కొన్నారు.

అన్ని శాఖలతో సమన్వయం చేసుకోండి

విద్యుత్‌కు అంతరాయం కలిగితే పునరుద్ధరణ సమయంలో అవసరమైతే కలెక్టరేట్, పోలీస్, రెవెన్యూ, శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. మధిర తహసీల్దార్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సబ్‌స్టేషన్లు నీటమునిగితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. విద్యుత్ కంట్రోల్ రూం నుంచి వచ్చే ఆదేశాలను అమలు చేయాలని చెప్పారు. విద్యుత్ అంతరాయానికి సంబంధించిన సమస్యలపై-912, 18004250028 టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేయాలని, ప్రజలనుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు.



నర్మెట మండలం మల్లన్నగండి వద్ద రాత్రి సమయంలో విధులు నిర్వర్తిస్తున్న రెవెన్యూ సిబ్బంది

- మరిన్ని ఫొటోలు 8,9లో



ఉధృతంగా ప్రవహిస్తున్న చీటకోడూరు వాగు



జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



కొత్తపల్లిలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



జనగామ : కురుమవాడ కాలనీలో నిలిచిన వరద నీరు

విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించాలి

● జేవీవీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్

జనగామ రూరల్: ప్రజల్లో సైన్స్‌పై అవగాహన కల్పిస్తూ విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించాలని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మారుతున్న సమాజంతో పాటు ప్రజలు మారాలని, వారిలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా నూతన కమిటీ ఎంపిక నేడు(సోమవారం) ఉంటుందని, ఉత్సాహంగా పని చేయాలనుకున్న వారు ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రం స్టేషన్ రోడ్డులోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసే సమావేశానికి రావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కేఎస్.మర్రెడ్డి, రవీందర్, శోభన్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, చంద్రశేఖర్‌రావు, కనకయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్

సోమేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

పాలకుర్తి టౌన్ : శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ఆదివారం సోమేశ్వరుడికి లక్ష బిల్వార్చన, మహాన్యాస పూర్వకంగా రుద్రాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. చండిక అమ్మవారి ఆలయంలో చండిక సమేతంగా శ్రీసోమేశ్వర స్వామి వారికి మాస కల్యాణం వైభవోపేతంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఇష్టదైవాలను దర్శించుకున్నారు. ఆలయ ఈఓ మోహన్‌బాబు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వామివారికి బిల్వార్చన నిర్వహిస్తున్న అర్చకులు

ఓపీఎస్ అమలు చేయాలి

● కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ సంఘాల నిరసన

జనగామ రూరల్: సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ అమలు చేయాలని టీజీఈ జాక్ జిల్లా అధ్యక్షుడు ఖాజా షరీఫ్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్ ఎదుట పెన్షన్ విద్రోహదినం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తెచ్చిన జీఓ 28 ఉద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఓపీఎస్ అమలుకు కసరత్తు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో టీజీఓ, టీఎన్‌జీఓ, యూటీఎఫ్ నాయకులు నీలం కోర్నేలియస్, శ్రీనివాస్, చంద్రశేఖర్‌రావు, మహిపాల్‌రెడ్డి, లక్ష్మణమూర్తి, ఎ.శ్రీనివాస్, ఎల్లారెడ్డి, నామ నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, హమీద్, నాగార్జున, కనకయ్య, అంకుషావలి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉద్యోగ నాయకులు

కేయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షల ఫలితాలు విడుదల

● 62.83శాతం ఉత్తీర్ణత

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీఒకేషనల్ కోర్సుల్లో ఆరో సెమిస్టర్ పరీక్షల్లో ఒక్క సబ్జెక్టులో ఫెయిలైన విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్. నర్సింహాచారి ఆదివారం తెలిపారు. మొత్తం 4,474మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2,811 మంది (62.83శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.ఈ ఫలితాలను సంబంధిత కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు.

రీవాల్యుయేషన్ ఫలితాలు..

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు గత నెలలో విడుదల చేశారు. అనంతరం రీవాల్యుయేషన్ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయా ఫలితాలను విడుదల చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్. నర్సింహాచారి ఆదివారం తెలిపారు. 4,470మంద రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు చేస్తే 883మంది బెనిఫిట్ పొందారు. 19.75శాతం ఉత్తీర్ణత సాధించారు.

'కాళోజీ' పురస్కారం ఎంపికకు కమిటీ ఏర్పాటు

హన్మకొండ కల్చరల్ : ప్రజాకవి కాళోజీ నారాయణరావు స్మారకంగా ఏటా అందజేసే 'కాళోజీ నారాయణరావు' పురస్కారాన్ని రాష్ట్ర యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం అండ్ కల్చర్ డిపార్ట్‌మెంట్ వారు 2024 సంవత్సరానికి గాను అర్హులకు ఎంపిక చేయడానికి కమిటీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు కమిటీ ఏర్పాటుకు శనివారం ప్రభుత్వ కార్యదర్శి ఏ. వాణిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ చైర్మన్‌గా ప్రజాకవి అందెశ్రీ, కన్వీనర్‌గా రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సభ్యులుగా కవి, అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, భాషా పండితులు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సంగంభట్ల నర్సయ్య, వరంగల్‌కు చెందిన కవి, కాళోజీ ఫౌండేషన్ ప్రతినిధి పొట్లపల్లి శ్రీనివాస్‌రావు ఉన్నారు.

తాడ్వాయిలో టోర్నడోలు..

● భారీ ఈదురుగాలులకు వేల సంఖ్యలో నేలకూలిన చెట్లు
● పరిశీలించిన మంత్రి సీతక్క


చెట్లు నేలకూలడంతో రోడ్డుకు ఇరువైపులా మైదానంలా కనిపిస్తున్న అడవి

ఎస్ఎస్‌తాడ్వాయి: తాడ్వాయి అడవుల్లో శనివారం రాత్రి వీచిన గాలులు అమెరికాలోని టోర్నడో తరహాలో పెను దుమారం రేపాయి. తాడ్వాయి–మేడారం మధ్య అడవిలో వేల సంఖ్యలో చెట్లు నేలకూలాయి. నిమిషాల వ్యవధిలో పచ్చని అడవి మైదానంలా మారింది. రోడ్డుకు ఇరువైపులా సుమారు 2 కిలోమీటర్ల దూరం మేర చెట్లు నేలకూలాయి. ఆదివారం మంత్రి సీతక్క మేడారం–తాడ్వాయి మధ్య నేలకూలిన చెట్లను పరిశీలించారు. వాహనాల రాకపోకలకు గంటల తరబడి అంతరాయం కలిగింది. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి సిబ్బందితో కలిసి చెట్లను తొలగించేందుకు గంటల పాటు శ్రమించారు. పోలీసుల సేవలను వాహనదారులు ప్రశంసించారు.


మహబూబాబాద్ అర్బన్: మున్నేరు వాగులో మునిగిన వాటర్ ట్యాంక్


కురవిలో డబుల్ ఇళ్ల కాలనీలోకి వచ్చిన వరద నీరు


ఎల్కతుర్తి మండలం ఇందిరానగర్‌లో కూలిన ఇంటిగోడలు


నెల్లికుదురు: మండలంలోని మేచరాజుపల్లిలో నేలమట్టమైన ఇల్లు

వర్ష బీభత్సం..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం బీభత్సం సృష్టిస్తోంది. ఫలితంగా పలు గ్రామాల్లో ఇళ్లు నీటమునుగుతున్నాయి. శిథిలావస్థలోని ఇళ్లు కూలుతున్నాయి. కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. రోడ్లు ఎక్కడికక్కడ తెగుతున్నాయి. ఫలితంగా ప్రయాణికులు మార్గమధ్యలో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా, వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువు మత్తళ్లు పోస్తున్నాయి. పంట పొలాలు నీటమునుగుతున్నాయి.

-సాక్షి నెట్‌వర్క్


కాశిబుగ్గ: గాంధీనగర్‌లో ఇంట్లోకి చేరిన వరద నీటిలో కామిని నరేశ్


మత్తడి దూకుతున్న వరంగల్‌లోని భద్రకాళి చెరువు


చెన్నారావుపేట శివారులో నీటిలో మునిగిన పంట పొలాలు


హనుమకొండ బస్టాండ్‌లోకి భారీగా చేరిన వరద నీరు


వర్షపు నీటితో నిండిన మహబూబాబాద్ రైల్వే అండర్ బ్రిడ్జి


వరంగల్ నాగేంద్రనగర్‌లో ఇంట్లోకి వచ్చిన వరద నీరు


ఏటూరునాగారం: కొండాయి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు


కొత్తగూడ: గండి పడిన రామన్నగూడెం ఊరచెరువు


జనగామ : కుందారం వాగు నుంచి వచ్చే వరదలో చేపలు పడుతున్న స్థానికులు

దెబ్బతిన్న రైల్వేట్రాక్..నిలిచిన రైళ్లు

● ప్రయాణికుల ఇబ్బందులు


కేసముద్రం రైల్వేస్టేషన్‌లో నిలిచిన సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైళ్లు

కేసముద్రం: భారీ వర్షం కారణంగా వరద ఉధృతికి మహబూబాబాద్ జిల్లా కేసముద్రం – ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య, మహబూబాబాద్– తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ల మధ్య వరద ఉధృతితో రెండుచోట్ల రైల్వేట్రాక్ దెబ్బతిన్న ఘటనతో రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. శనివారం సాయంత్రం నుంచి మొదలైన భారీవర్షం, అదేరీతిలో కురవడంతో కేసముద్రంవిలేజ్ పెద్దచెరువు, దామెరచెరువు, ఇంటికన్నె చెరువులు మత్తళ్లు పోశాయి. దీంతో ఆ మత్తళ్లు పోసిన వరదనీరుతో ఇంటికన్నె– కేసముద్రం రైల్వేస్టేషన్ల మధ్య ట్రాక్ తెగిపోయింది. అప్పటికే అప్‌లైన్‌లో బెంగళూర్ –దానాపూర్ సంగమిత్ర, డౌన్‌లైన్‌లో దానాపూర్ –బెంగళూర్ సంగమిత్ర ఎక్స్‌ప్రెస్ రైళ్లను కేసముద్రం రైల్వేస్టేషన్‌లో ఆదివారం తెల్లవారుజామున 2గంటల ప్రాంతంలో నిలిపారు. కాగా, అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున వరకు ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆదివారం ఉదయం రైల్వేస్టేషన్‌కు చుట్టూరా వరద ఉధృతి ఉండడంతో ఎవరూ హోటళ్లు తెరవలేదు. దీంతో పిల్లలతో ప్రయాణీకులు ఆకలితో ఇబ్బందులు పడ్డారు. దీంతో మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, దాతలు, పలుసంఘాల నాయకులు స్పందించారు. వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు, పాలు, భోజనం అందజేశారు. సుమారు 4 వేల మంది ప్రయానీకులు ఒక్కసారిగా రైల్వేస్టేషన్‌లో దిగడంతో ప్రాంగణమంతా కిక్కిరిసింది. కాగా, సాయంత్రం వరకు రైళ్లు ఎటూ కదలకపోవడంతో ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు పంపించాలంటూ అధికారులతో మొరపెట్టుకున్నారు. అధికారులు కలిసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ, ప్రైవేట్ బస్సుల్లో రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్‌రాజు ఆధ్వర్యంలో ప్రయాణికులను క్షేమంగా వరంగల్ తరలించారు.

డోర్నకల్ టు రాజమండ్రి రూ. 12 వేలు

భారీ వర్షాలతో రైల్వే ట్రాక్ దెబ్బతిని ఆదివారం పలు రైళ్లు డోర్నకల్‌లో నిలిచిపోయాయి. రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో అత్యవసర పనులపై వెళ్తున్న వారు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. ఖమ్మం, మహబూబాబాద్, హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి తదితర ప్రాంతాలకు వెళ్తున్న వారు తమ సమీప బంధువులు, మిత్రులకు సమాచారం అందించి వాహనాలను సమకూర్చుకుని వెళ్లారు. వరంగల్ నుంచి రాజమండ్రి వెళ్తున్న ఓ బృందం ఖమ్మం నుంచి వాహనాలను డోర్నకల్‌కు రప్పించి ఒక్కో వాహనానికి రూ.12 వేల చొప్పున చెల్లించి వెళ్లారు. ఖమ్మం, మహబూబాబాద్ తదితర ప్రాంతాల్లో ప్రైవేట్ వాహనాలను అద్దెకు తీసుకుని వెళ్లారు.

థాంక్యూ డోర్నకల్...

● సుమారు మూడు వేల మంది ప్రయాణికులకు తాగునీరు, అల్పాహారం, భోజనం అందించిన పట్టణ వాసులు.
● హర్షించిన రైలు ప్రయాణికులు

డోర్నకల్ వాసులు మానవత్వం చాటారు. భారీ వర్షాలతో రైల్వే ట్రాక్ దెబ్బతిని డోర్నకల్‌లో గంటల పాటు రైళ్లు నిలిచాయి. ఫలితంగా దూరప్రాంత ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో మేమున్నామంటూ డోర్నకల్ వాసులు ముందుకొచ్చారు. రాజకీయ నాయకులు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ముస్లిం సంస్థల ప్రతినిధులు రైల్వే స్టేషన్‌కు చేరుకుని ప్రయాణికులకు చేయూతనందించారు. ఉదయం 1.3 క్వింటాళ్లతో ఉప్మా, టమాటా బాత్ తయారు చేసి పంపిణీ చేశారు. మధ్యాహ్నం నుంచి 2.5 క్వింటాళ్ల బియ్యంతో పాటు కూరగాయలతో భోజనం సిద్ధం చేసి రైల్వే సిబ్బంది సహకారంతో ప్రయాణికులకు భోజనం పంపిణీ చేశారు. స్థానిక వాటర్‌ప్లాంట్ యజమానులు ప్రయాణికులకు వాటర్ పంపిణీ చేశారు. రైల్వే ట్రాక్ దెబ్బతిని ఆరు రైళ్లు డోర్నకల్‌లో గంటల తరబడి నిలవగా స్థానికులు నీళ్లు, అల్పాహారం, భోజనం అందించడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

మహబూబాబాద్‌లో..

మహబూబాబాద్ రూరల్ : వర్షం కారణంగా మహబూబాబాద్ రైల్వేస్టేషన్ రెండో నంబరు ప్లాట్‌ఫారం వైపున మచిలీపట్నం, సింహపురి రైళ్లు నిలిచిపోయాయి. రెండు రైళ్లలో కలిపి సుమారు రెండు వేల మంది వరకు ప్రయాణికులు ఉండగా వారు ఇబ్బందులు పడుతుండగా సమాచారం తెలుసుకున్న టౌన్ పోలీసులు, జీవీఎల్, శ్రీవాసవి సేవా ట్రస్ట్, శ్రీవాసవి దేవాలయ కమిటీ, సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహారం, స్నాక్స్, మంచినీళ్లు అందజేసి ఆదుకున్నారు. ప్రయాణికులకు అవసరమైన బీపీ, షుగర్, జ్వరం పరీక్షలు జరిపి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు అందజేశారు.



కేసముద్రం- ఇంటికన్నె మధ్య వరద ఉధృతికి దెబ్బతిన్న రైల్వేట్రాక్


డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు భోజనం పంపిణీ చేస్తున్న స్థానికులు


మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు భోజనం అందజేస్తున్న పోలీసులు, వర్తక, వాణిజ్య సంస్థల ప్రతినిధులు

మృత్యు ప్రవాహం..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం పలు కుటుంబాల్లో విషాదం నింపుతోంది. ఆస్తితోపాటు ప్రాణనష్టం కలిగిస్తోంది. భీకర వరద ప్రవాహంలో ముగ్గురు కొట్టుకుపోయి మృతి చెందారు. ఒకరు గల్లంతయ్యారు. ఓ వృద్ధురాలు పిడుగుపాటు శబ్దానికి భయాందోళనకు గురై గుండెపోటుతో మృతి చెందింది. దీంతో ఆయా కుటుంబాలు శోక సంద్రంలో మునిగాయి.


వరదనీటిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు

దుగ్గొండి: వరద నీటి ప్రవాహంలో పడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం మండలంలోని గిర్నిబావి సమీపంలో జరిగింది. మందపల్లి గ్రామానికి చెందిన కొంగ్ర సమ్మక్క(75) రోజూ గిర్నిబావికి వచ్చి భిక్షాటన చేసి ఇంటికి వెళ్లేది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం వరకు గిర్నిబావిలో కనిపించిన సమ్మక్క.. చీకట్లో జోరు వానలో దారి తెలియక మందపల్లి రోడ్డుకు వెళ్లాల్సి ఉండగా దుగ్గొండి రోడ్డుకు వెళ్లింది. లోకేశ్వర ఇండస్ట్రీస్ సమీపంలో రోడ్డు పక్కన కాలుజారి వరదనీటిలో పడింది. ఆదివారం ఉదయం వరద ఉధృతి తగ్గడంతో మృతదేహం కనిపించింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయగా కొంగ్ర సమ్మక్కగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతురాలికి కుమారుడు సదయ్య, కుమార్తె సాంబలక్ష్మి అన్నారు. ఘటనా స్థలిని ఎమ్మెల్యే మాధవరెడ్డి సందర్శించారు. బాధిత కుటుంబానికి రూ. 10 వేల ఆర్థికసాయం అందించారు.

ఎస్సై వెంకటేశ్వర్లు మానవత్వం..

వరద నీటిలో తేలిన కొంగ్ర సమ్మక్క మృతదేహాన్ని బయటకు తీసుకురావడానికి అటుగా వెళ్తున్న వారిని అడిగితే సహకరించకపోవడంతో ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు స్వయంగా బురదలోకి దిగారు. హోంగార్డుతో కలిసి మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చి శుభ్రం చేశారు.

పిడుగుపాటు శబ్దానికి వృద్ధురాలి మృతి

గూడూరు: పిడుగుపాటు శబ్దానికి భయభ్రాంతులకు గురైన ఓ వృద్ధురాలు.. గుండెపోటుతో మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని బొల్లెపల్లి శివారు ఎస్సీ కాలనీలో జరిగింది. కాలనీకి చెందిన కోరె తిరుపతమ్మ (55) ఇంటి వద్ద ఒక్కరే ఉంటుంది. ఈ క్రమంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి శబ్దంతో కూడిన పిడుగు తిరుపతమ్మ ఇంటి సమీపంలో పడింది. ఈ శబ్దానికి ఇంట్లో నిద్రిస్తున్న తిరుపతమ్మ భయభ్రాంతులకు గురై గుండెనొప్పి అంటూ మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

పశువుల కోసం వెళ్లి కాల్వపల్లిలో యువకుడు..


మల్లికార్జున్ (ఫైల్)

ఎస్ఎస్‌తాడ్వాయి: పశువుల కోసం వెళ్లిన ఓ యువకుడు ఒర్రె(వాగు)లో పడి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని కాల్వపల్లిలో చోటు చేసుకుంది. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జెరుపోతుల మల్లికార్జున్(38) పశువుల కోసం వెళ్లాడు. వస్తున్న క్రమంలో గ్రామంలోని పాఠశాల వెనుక ఉన్న ఒర్రె లోనుంచి నుంచి దాటుతున్న క్రమంలో వరదలో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

రాజీపేటలో చెరువులో పడి వ్యక్తి..

పరకాల: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి..చెరువులో జారి పడి మృతిచెందాడు. ఈ ఘటన పరకాల మున్సిపాలిటీ విలీన గ్రామం రాజీపేటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గువ్వ రాములు(58) గత నెల 30న మరో ఇద్దరితో కలిసి చేపల వేట కోసం వెళ్లాడు. చెరువు వద్దకు వెళ్లిన ఇద్దరు ఇంటికి రాగా రాములు మాత్రం రాలేదు. దీంతో ఆందోళన చెందుతూ అదే రాత్రి నుంచి గాలించిన ఫలితం కనిపించలేదు. చివరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనుమానిత ప్రాంతాలలో డ్రోన్ ద్వారా గాలింపు చేయగా అలియాబాద్ సమీపంలోని ఓ కుంట వద్ద రాములు మృతదేహం లభ్యమైంది. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వెంకటాపురంలో చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు..


నర్సయ్య (ఫైల్)

తొర్రూరు రూరల్: రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో ఉధృతంగా ప్రవహిస్తున్న మండలంలోని వెంకటాపురం శివారులో ఉన్న వాగులో పడి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. గ్రామానికి చెందిన గుండాల వెంకన్న, నర్సయ్య అన్నదమ్ముళ్లు. ఇద్దరూ కలిసి చేపల వేట కోసం శనివారం సాయంత్రం వాగు వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో నర్సయ్య(47) కాలుజారి వాగులో పడడంతో వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. తన తమ్ముడు నర్సయ్య వాగులో కొట్టుకుపోతుండగా కాపాడలేని స్థితిలో లబోదిబోమంటూ వెంకన్న పరిగెత్తుకుంటూ వెళ్లి కుటుంబీకులు, గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. దీంతో వారు వాగు వద్దకు వెళ్లి చూడగా నర్సయ్య అప్పటికే కొట్టుకపోయాడు. ఆదివారం ఉదయం ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, పోలీసులు, అధికారులు ఘటనా స్థలిని పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గాలింపు చర్యలు చేపట్టగా ఇంకా నర్సయ్య ఆచూకీ లభించలేదు.

రైల్వే రవాణా అతలాకుతలం..


కాజీపేట జంక్షన్‌లో రైళ్ల కోసం ప్రయాణికుల పడిగాపులు


కాజీపేట జంక్షన్‌లో కలెక్టర్ ప్రావీణ్య

● వర్షాలతో పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు
● కాజీపేట, వరంగల్ మీదుగా ప్రయాణించే 28 రైళ్లు రద్దు
● 21 ట్రైన్లు దారి మళ్లింపు

కాజీపేట రూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వరంగల్–విజయవాడ మార్గంలో ఇంటికన్నె, తాళ్లపూసపల్లి సమీపంలో రైల్వే ట్రాక్ ధ్వంసమైంది. దీంతో ఆదివారం రైల్వే రవాణా వ్యవస్థ అతలాకుతలమైంది. ఫలితంగా దక్షిణ మధ్య రైల్వే అధికారులు కాజీపేట, వరంగల్ స్టేషన్ల మీదుగా న్యూఢిల్లీ–విజయవాడ–హైదరాబాద్ రూట్‌లో వెళ్లే పలు రైళ్లు రద్దు చేయడంతోపాటు పలు రైళ్లను దారి మళ్లింపు, మరి కొన్ని రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడిపిస్తున్నారు.

రద్దయిన రైళ్లు ఇవే

విజయవాడ–సికింద్రాబాద్ (12713) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–విజయవాడ (12714) ఎక్స్‌ప్రెస్, గుంటూరు–సికింద్రాబాద్ (17021) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–సిర్‌పూర్‌కాగజ్‌నగర్ (17233) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–గుంటూరు (12706) ఎక్స్‌ప్రెస్, గుంటూరు–సికింద్రాబాద్ (12705) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–గుంటూరు (17202) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–సికింద్రాబాద్ (20708) ఎక్స్‌ప్రెస్, కాకినాడ పోర్టు–లింగంపల్లి (12737) ఎక్స్‌ప్రెస్, గూడూరు–సికింద్రాబాద్ (12709) ఎక్స్‌ప్రెస్, భద్రాచలం–బల్లార్షా (17033) ఎక్స్‌ప్రెస్, బల్లార్షా –కాజీపేట (17004) ప్యాసింజర్, భద్రాచలం–సికింద్రాబాద్ (17660) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–భద్రాచలం (17659) ఎక్స్‌ప్రెస్, కాజీపేట–డోర్నకల్ (07753) ప్యాసింజర్, సికింద్రాబాద్–హౌరా (12704) ఎక్స్‌ప్రెస్, కరీంనగర్–తిరుపతి (12762) ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–విశాఖపట్నం (12728) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–హైదరాబాద్ (12727) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–సికింద్రాబాద్ (12739) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–మణుగూరు (12745) ఎక్స్‌ప్రెస్, మణుగూరు–సికింద్రాబాద్ (12746) ఎక్స్‌ప్రెస్, తాంబరం–హైదరాబాద్ (12759) ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–తాంబరం (12760) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–ఎల్‌టీటీ ముంబయి (18519) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–మహబూబ్‌నగర్ (12861) ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్–జైపూర్ (12967) ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్–న్యూఢిల్లీ (12615) ఎక్స్‌ప్రెస్, తిరుపతి–సికింద్రాబాద్ (0 7481) ఎక్స్‌ప్రెస్, చెన్నైసెంట్రల్–న్యూఢిల్లీ (1262 1) ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు అధికారులు తెలిపా రు.

దారి మళ్లింపు..

విజయవాడ, డిల్లీ, మార్గంలో ప్రయాణించే 21 రైళ్లను వయా కాజీఏట, వయా నడికుడ మీదుగా దారి మళ్లించి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ప్రమాదకరంగా నష్కల్ వద్ద రైల్వే ట్రాక్..

కాజీపేట–ఘన్‌పూర్ మధ్యలోని నష్కల్ రైల్వే వంతెన వద్ద ట్రాక్‌కు ప్రమాదం పొంచి ఉంది. రైల్వే అధికారులు ట్రాక్‌మెన్లు, పెట్రోల్‌మెన్లను అప్రమత్తం చేసి గస్తీ ముమ్మరం చేశారు.

4వేల మంది ప్రయాణికుల తరలింపు

కేసముద్రం మండలంలో రైల్వేట్రాక్ తెగడంతో కాజీపేట జంక్షన్‌లో రైళ్లను నిలిపివేశారు. ఆదివారం రాత్రి హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేష్‌లు వచ్చారు. జంక్షన్‌లో ఉన్న సుమారు నాలుగు వేల మంది ప్రయాణికులను స్వస్థలాలకు పంపించే ఏర్పాట్లు చేశారు. కొందరిని కాజీపేట నుంచి ధానాపూర్, బెంగళూర్‌కు ప్రత్యేక రైల్‌లో పంపించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిలు రైల్వే స్టేషన్‌కు చేరుకొని ప్రయాణికులతో మాట్లాడి అన్ని విధాల ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ హైద్రాబాద్‌లో ఫోర్త్ సిటీ, శ్రీశైలం హైవే HMDA, DTCP ప్లాట్లు కలవు. ఇప్పుడు మాత్రమే తక్కువ ధరలో మహేశ్వరం, ముచ్చర్ల మరో న్యూయార్క్. Cell: 8008091512. [W-1239907]

■ HNK, KITS College అంబాల రోడ్‌కు & ముచ్చర్ల రోడ్‌కు కొత్తగా వస్తున్న హైవే రోడ్‌కు దగ్గరలో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మబడును. సంప్ర॥ 9553255936. [W-1239955]

SERVICES

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■ మీ యొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు. సెల్: 9849145043 [W-1239959]

WANTED

■ అపాంట్‌మెంట్స్ షాపింగ్ మాల్స్ ఆఫీస్‌లో గల పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్, వాచ్‌మెన్స్, ఆయాలు అర్జెంటుగా స్త్రీలు, పురుషులు కావలెను సంప్ర॥ 9491706517 [W-1239960]

■ ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థలో పని చేయుటకు ములుగు, భూపాలపల్లి జిల్లాలో రియల్ ఎస్టేట్ ఏజెంట్లు కావలెను. రిటైర్డ్ ఉద్యోగులు, గృహిణులు, LIC ఏజెంట్లకు సదావకాశం. ఆకర్షణీయమైన జీతం. 7416975767, 8978118889. [WA-584]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం 18K. ఫోన్: 9160900024, 9640400073 [H-796271]

■ ప్రముఖ హౌస్‌కీపింగ్ సంస్థలో పని చేయుటకు హౌస్ కీపింగ్ బాయ్స్, లోడర్స్, సూపర్‌వైజర్స్,Tailorకావలెను. కన్సల్టెన్సీ కాదు. (Sal 12K to 15K) Location: Naimnagar, Warangal.Ph:7671954016, 7995444426 [HA-14564]

మీ చిన్నారి పుట్టినరోజు శుభాకాంక్షలను ఇప్పుడు సాక్షి ద్వారా తెలియజేయండి కేవలం రూ.500/- మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ. అదనపు లైను 60/- రూ. మాత్రమే 5% GST అదనము